ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 04 నవంబరు , 2026 | పేజీలు : 06



మంత్రి సీతక్కకు ఘన సన్మానం



రాజకీయాలకు అతీతంగా గ్రామ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/మిర్యాలగూడ : గ్రామాల్లోని సమస్యలను అధికారులు రాజకీయాలకు అతీతంగా త్వరితగతిన పరిష్కరించాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. మంగళవారం మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీకి సర్పంచ్ గ్రామ ప్రథమ పౌరుడని, కాబట్టి ఆ గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామస్తులు మొదట సర్పంచ్ వద్దకే వచ్చి తెలియపరుస్తారని పేర్కొన్నారు. ఏ పార్టీకి చెందిన సర్పంచ్ అయినా గ్రామాభివృద్ధి కోసం అధికారులను సంప్రదిస్తే వెంటనే స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఆదేశించారు.అనంతరం సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారుల నివేదికలపై సుదీర్ఘంగా చర్చించారు. వచ్చే రబీ సీజన్ లో వరి పంటలు వేయకుండా ఆరుతడి పంటలైన మినుము, పెసర వంటి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కోరారు. ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో వర్షపు నీరు నిలవకుండా చూడాలని, శిథిలావస్థకు చేరిన భవనాలను వి బి గ్రామ్ జి నిధులతో నూతనంగా నిర్మించుకోవచ్చని మండల విద్యాధికారి వివరించారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని మండల రెవెన్యూ శాఖ అధికారి తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో బాల్యవివాహాలను అరికట్టేందుకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీవో సూచించారు. ఎల్ఎనినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు పడిపోయి తాగునీటికి, పశుగ్రాసానికి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున జల సంరక్షణ పనులను ముమ్మరం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శేషగిరి శర్మ తెలిపారు. రైతుల పొలాల్లో ఫారం పాండ్లు తవ్వించడం, గుట్టలకు కందకాలు, పశువుల తాగునీటి తొట్లు, చెరువుల్లో పూడికతీత వంటి జలసిరి పనులు చేపట్టడం వల్ల వ్యవసాయ కూలీలకు పనిదినాలు పెరిగి భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ 70 శాతం నిధులు, 30 శాతం పంచాయతీ నిధులతో అంగన్వాడీ కేంద్రాల్లో శౌచాలయాలు, డ్రైన్ సోక్ పిట్లు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్షకుడే భక్షకుడైతే!

పోలీస్ స్టేషన్‌లోనే వాహనాలు మాయం.. కలకలం

ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడా.. స్టేషన్‌లో సిసి కెమెరాల నిఘా ఏమైంది?

ఎన్ని వాహనాలు అమ్మారో.. తేలాల్సిందే ... కానిస్టేబుల్ సైదులుపై వేటు..

ప్రజాపక్షం/నకిరేకల్ : దొంగల నుంచి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే.. భద్రత కోసం తమకు అప్పగించిన ఆస్తులపై కన్నేస్తే.. నేరాలను ఛేదించాల్సిన ఖాకీనే అక్రమాలకు పాల్పడితే.. కంచే చేను మేసిన చందంగా మారదా ప్రజలు తమ ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించే పోలీస్ శాఖలోనే, పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన వాహనాలకు భద్రత కరువైతే నిఘా వ్యవస్థ ఉన్నది ఎందుకు అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలను ఓ కానిస్టేబుల్ అక్రమంగా విక్రయించినట్లు వస్తున్న ఆరోపణలు పోలీస్ శాఖలో కలకలం రేపుతున్నాయి. మూడు వాహనాలను రికవరీ చేసినట్లు సమాచారం. అయితే ఇది మూడు బైక్‌లకే పరిమితమా లేక మరిన్ని వాహనాలు మాయమయ్యాయా అన్నది ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంది.



అసలేం జరిగింది ..?

నేరాలకు సంబంధించిన కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పాటు, కార్డన్ సెర్చ్‌ల

తరువాయి 2లో

పివైఎల్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి





ప్రతి గింజనూ మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం

రక్షకుడే భక్షకుడైతే..

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో సరైన పత్రాలు లేవని పట్టుకున్న ద్విచక్ర వాహనాలను పోలీసులు స్టేషన్‌లో భద్రపరుస్తుంటారు. వాటిని విడిపించుకోవాలంటే యజమానులు కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుంది. అయితే కొందరికి ఈ ప్రక్రియ తెలియకపోవడం, మరికొందరు పట్టించుకోకపోవడంతో వాహనాలు స్టేషన్‌లోనే ఉండిపోతున్నాయి. ఇదే అదనుగా భావించిన కానిస్టేబుల్ పి.సైదులు యాదవ్ వాటిని అక్రమంగా విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరోనా సమయంలోనే ఈ వ్యవహారం మొదలైనట్లు సమాచారం. జల్సాలకు అలవాటుపడి, జీతం సరిపోక డబ్బుల కోసం వాహనాలు అమ్మినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఓ కొత్త మోడల్ పల్సర్ బైక్‌ను నకిరేకల్‌కు చెందిన వ్యక్తికి రూ.10 వేలకే విక్రయించినట్లు తెలుస్తోంది.

యజమాని రాకతో వెలుగులోకి.. హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన వ్యక్తి పల్సర్ బైక్ ఓ కేసులో సీజ్ కావడంతో నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. ఆ వాహనం తాళాలు విధుల్లో ఉన్న సిబ్బంది వద్ద ఉండేవి.వాటిని ఉపయోగించి బైక్‌ను విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.కొనుగోలు చేసిన వ్యక్తి నంబర్ ప్లేట్ లేకుండానే బైక్‌పై తిరిగేవాడని,ఎక్కడైనా పోలీసులు ఆపితే సంబంధిత కానిస్టేబుల్‌కు ఫోన్ చేయడంతో వాహన పత్రాల తనిఖీ లేకుండానే వదిలేసేవారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహన యజమాని హైదరాబాద్ నుంచి వచ్చి స్టేషన్‌లో ఆరా తీయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఇప్పటివరకు మూడు వాహనాలను రికవరీ చేసినట్లు, కొనుగోలుదారులను విచారిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ వ్యవహారంలో ఎవరెవరు ఉన్నారు అన్నది విచారణలో తెలియాల్సి ఉన్నది.

కానిస్టేబుల్ పి.సైదులు యాదవ్‌పై వేటు:



వాహనాల అక్రమ విక్రయాల ఆరోపణల నేపథ్యంలో కానిస్టేబుల్ పి.సైదులు యాదవ్‌పై జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వేటు చేసినట్లు విశ్వనీయ సమాచారం. పోలీస్ శాఖలో పనిచేసే వారైనా చట్టానికి అతీతులు కాదనే సందేశం ఈ చర్యతో స్పష్టమవుతోంది.అయితే స్టేషన్‌లో ఎన్ని వాహనాలు మాయమయ్యాయి? వాటి విక్రయాల వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

మర్రిగూడ పంచాయతీరాజ్ శాఖలో కలకలం

కార్యదర్శి సస్పెన్షన్ వివాదం.. ఎంపీడీవోపై డిపిఓ విచారణ.. 15 మంది కార్యదర్శుల మూకుమ్మడి సామాజిక సెలవు

ప్రజాపక్షం/మర్రిగూడ : మండలంలో పంచాయతీరాజ్ శాఖలో పరిణామాలు మంగళవారం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఖొఢాబాక్షిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసన్నబాబు సస్పెన్షన్‌ను నిరాధారమని ఖండించగా, అదే సమయంలో ఎంపీడీవో మున్న య్యపై వచ్చిన నిధుల దుర్వినియోగ ఆరోపణలపై జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) తరుణ్ చక్రవర్తి విచారణ చేపట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో మండలంలోని 15 మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు బుధవారం నుంచి సామాజిక సెలవు ప్రకటిస్తూ అధికారులకు వినతిపత్రం అందజేయడం పరిస్థితికి మరింత వేడి తెచ్చింది.

తప్పుడు నివేదికలతో సస్పెన్షన్: ప్రసన్నబాబు

ఖొఢాబాక్షిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసన్న బాబు మాట్లాడుతూ ఫోర్జరీ సంతకాల వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి ప్రోత్సాహంతో ఎంపీడీవో తప్పుడు నివేదికలను కలెక్టర్, డిపిఓకు పంపించడంతో తన సస్పెన్షన్ జరిగిందని ఆరోపించారు. తనపై తీసుకున్న చర్యలు నిరాధారమని పేర్కొంటూ నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అయితే గ్రామంలోని కొందరు ప్రజలు మాత్రం ప్రసన్నబాబు గతంలోనూ ఇలాంటి చర్యలకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ, ఆయనపై సస్పెన్షన్ చర్యలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు.



ఎంపిడిఓపై డిపిఓ విచారణ

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ మున్న య్యపై పలు శాఖలకు సంబంధించిన నిధుల దుర్వినియోగ ఆరోపణలపై డిపిఓ తరుణ్ చక్రవర్తి విచారణ నిర్వహించారు. స్థానిక ఎన్నికలు, ప్రజాపాలన కార్యక్రమాలు, వార్డు నంబర్ల శిక్షణకు సంబంధించిన నిధుల వినియోగంపై వివరాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని పేర్కొన్నారు.

15 మంది కార్యదర్శుల సామాజిక సెలవు

మండలంలోని 15 మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు బుధవారం నుంచి సామాజిక సెలవు కోరుతూ ఎంపీడీవో,ఎంపీవోలకు వినతిపత్రం అందజేశారు.పని భారం పెంచడంతోపాటు కేబీపల్లి కార్యదర్శిపై తప్పుడు నివేదికలు ఇచ్చి సస్పెన్షన్ చేయించారని, అధికారుల వేధింపుల కారణంగా విధులు నిర్వహించడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలో చర్చనీయాంశంగా పరిణామాలు

ఒకవైపు కార్యదర్శి సస్పెన్షన్ వివాదం, మరోవైపు ఎంపీడీవోపై అధికారిక విచారణ, ఇక పంచాయతీ కార్యదర్శుల మూకుమ్మడి సామాజిక సెలవుతో మర్రిగూడ మండలంలో పంచాయతీరాజ్ శాఖ పనితీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లాస్థాయి విచారణ నివేదిక వెలువడిన తర్వాత ఈ వ్యవహారంలో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

రేపు జనరల్ బాడీ సమావేశం..నిర్ణయాలపై ఉత్కంఠ

మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల జనరల్ బాడీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరు కానున్నారు. ఎలాంనో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితులు, తాగునీటి సమస్యలు, ఉపాధి హామీ పనులపై సమగ్రంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.అయితే 15 మంది పంచాయతీ కార్యదర్శుల సామూహిక సామాజిక సెలవు,ఎంపీడీవోపై విచారణ నేపథ్యంలో సమావేశం ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

అర్హులైన గీతకార్మికులకు పింఛన్లు ఇవ్వాలి

గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి

ప్రజాపక్షం/చండూరు : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల నూతన సొసైటీలు, టీఎఫ్‌టీ లైసెన్స్‌లను వెంటనే మంజూరు చేయాలని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చండూరు మండల కేంద్రంలో గీత పనివారల సంఘం 16వ మహాసభ పల్లె శంకరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమవేశానికి ముఖ్య అతిధిగా పబ్బు వీరస్వామి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ కొత్తగా దరఖాస్తు చేసుకున్న గీత కార్మికుల సొసైటీలకు ,టీఎఫ్‌టీ లైసెన్స్‌లకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఫించన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన గీత కార్మికులందరికి వెంటనే ఫించన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా తాటి, ఈత చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని వీరస్వామి అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గీతా కార్మికుల జీవనోపాధికి ఉపయోగపడేలా విస్తృతంగా చెట్లను నాటేందకు చర్యలు తీసుకోవాలన్నారు. నల్లగొండలో నీరా ప్యాక్టరీని నెలకొల్పాలని ప్రభుత్వాని కోరారు. రూ.1000కోట్ల నిధులతో గీతా కార్మికుల కోసం సంక్షేమనిధిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ గీత కార్మికులకు మోపైడ్ బైకులు అందించి వారి వృత్తికి అవసరమైన సహాయాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీతా కార్మికుల సంక్షేమం, ఉపాధి భధ్రతకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లరాజు రామలింగయ్య మాట్లాడుతూ గీత వృతిపై ఆధారపడి జీవించే ప్రతి గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చండూరు మండలంలో గీతా పనివారల సంఘం అభివృద్ధి కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య గౌడ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, గీత పనివారల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బోయపల్లి శంకరయ్య, గంట నాగేష్, గండు కేషవులు, బోయపల్లి వెంకటేశం బొడ్డు ముత్తయ్య, గునగంటి యాదయ్య, పల్లె యాదయ్య, జిల్లా రాములు, నర్సింహ్మా, బోయపల్లి లింగయ్య, నక్కపోతు ముత్తయ్య, నకిరెకంటి బిక్షమయ్య, బి.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా నాంపల్లికి మార్కెట్ కమిటీ పీఠం దక్కేనా?

ఏళ్ల నిరీక్షణకు తెరపడేనా? కాంగ్రెస్ ఆశావహుల్లో పెరుగుతున్న ఉత్కంఠ.. అధిష్ఠానం నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి!

ప్రజాపక్షం/నాంపల్లి: పదవుల కోసం ఎదురుచూపులు.. ప్రతిసారీ చివరి నిమిషంలో నిరాశలు.. అయినా పార్టీని వీడకుండా జెండా మోస్తున్న నాయకులు.. ఇదీ నాంపల్లి మండల కాంగ్రెస్ శ్రేణుల పరిస్థితి సమీపంలోని మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గం నియామక ప్రక్రియపై చర్చ మొదలవడంతో నాంపల్లి మండల కాంగ్రెస్ నాయకుల్లో మరోసారి ఆశలు చిగురిస్తున్నాయి. ఈసారైనా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నాంపల్లికి దక్కుతుందా? లేక మరోసారి నిరాశే ఎదురవుతుందా అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

ప్రతిసారీ ఆశలు.. చివరికి నిరాశలే

నాంపల్లి మండలానికి చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గతంలోనూ మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం గట్టి ప్రయత్నాలు చేశారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేస్తూ, ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో పార్టీ విజయానికి తమ వంతు కృషి చేసినప్పటికీ పదవి మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. పలుమార్లు నాంపల్లి నాయకుల పేర్లు పరిశీలనలోకి వచ్చినా, చివరి నిమిషంలో ఇతర మండలాలకు అవకాశం దక్కడంతో స్థానిక నాయకుల్లో అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈసారైనా తమ మండలానికి న్యాయం చేయాలని వారు గట్టిగా కోరుతున్నారు.

ఆశావహుల మధ్య తీవ్ర పోటీ

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్న నాంపల్లి నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు, నియోజకవర్గ ముఖ్య నేతలను కలిసి తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని కోరుతున్నారు. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందించిన సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ ఒకవైపు వినిపిస్తుండగా, మరోవైపు సామాజిక సమీకరణాలు తమకు అనుకూలంగా మారుతాయని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఆశావహులు ఆశలు పెట్టుకున్నారు. దీంతో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందన్న ఉత్కంఠ నెలకొంది. మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠంపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది ఈసారి నాంపల్లి నాయకుల నిరీక్షణకు తెరపడుతుందా లేక మరోసారి పక్క మండలాలకే పదవి పరిమితమవుతుందా అన్నది ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

ప్రజాపక్షం/చిట్యాల : రైతులు ఆరుగాం కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో గుండ్రాంపల్లి, సుంకెనపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోఉ కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం సేకరణలో జాప్యం జరగకుండా అధికారులు సమస్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. డిసిసిబి వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, సుంకెనపల్లి సర్పంచ్ ఆవుల సునితయాదయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జడల చినమల్లయ్య, నాయకులు నమ్ముల విజయ్, వరకాంతం అంజిరెడ్డి, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సెలవు

తుఫాన్ హెచ్చరికతో కలెక్టర్ కీలక ఆదేశాలు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం సెలవు ప్రకటించారు. మురసు తుఫాన్ హెచ్చరికలతో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. తుఫాన్ ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. డిఇఓ, ఎంఇఓలు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి, సిపిడిఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే ఈ ఆదేశాలను సంబంధిత అధికారులు చేరవేయాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థుల భద్రతతోపాటు వారికి అవసరమైన సౌకర్యాలు, నిత్యవసరాలు కల్పించాలని స్పష్టం చేశారు.

పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: యాసంగి సీజన్‌లో పంటల వైవిధ్యీకరణకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని ఎడిఏ శ్రీలక్ష్మి రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పాత్లావత్ తండాలో నిర్వహించిన కేతీ బచావో అభియాన్ కార్యక్రమంలో ఆమె మండల వ్యవసాయ అధికారి జానకిరాములుతో కలిసి రైతులకు పలు సూచనలు చేశారు. ఎల్‌నినో దృష్ట్యా రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా అరుణ



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా టిఎస్ యుటిఎఫ్ ఉపాధ్యక్షురాలిగా చిట్యాల మండలం ఆరెగూడెంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బడుగు అరుణ ఎన్నికైంది. జిల్లాలోని కట్టంగూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన జిల్లా మహాసభల్లో జరిగిన జిల్లా సంఘ ఎన్నికల్లో అరుణను ఏకగ్రీవంగా ఎన్నికైంది. వరుసగా మూడవ సారి ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక కావడం విశేషం. అలాగే చిట్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎం.జానకి, వెంకటాపురం పిఎస్‌లో పనిచేస్తున్న గడగోజు సతీష్‌లు జిల్లా కమిటి సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన అరుణ, జానకి, సతీష్‌లకు సహా ఉపాధ్యాయులు, సంఘ నాయకులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

లక్ష్మణ్‌గౌడ్ మరణం బాధాకరం



ప్రజాపక్షం/చిట్యాల: జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన మలిదశ ఉద్యమకారులు, పిఏసిఎస్ డైరక్టర్ లక్ష్మణ్‌గౌడ్ ఆత్మహత్య చాలా బాధాకరమైనదని తెలంగాణ మలిదశ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూనూరు సంజయ్‌దాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న లక్ష్మణ్ తెలంగాణ ఆవిర్భావం తరువాత ఉద్యోగాలు వస్తాయని, మంచి గుర్తింపు వస్తుందని ఆశించాడని, అవి రావని తెలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని విమర్శించారు. మలి దశ ఉద్యమకారులను ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని సంజయ్‌దాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద వేణుగోపాల్‌రెడ్డి, జోగు లింగస్వామిలు పాల్గొన్నారు.

ప్రమాద మృతురాలి కుటుంబానికి విపుల్ పరామర్శ

ప్రజాపక్షం/నకిరేకల్: మండలం నోముల గ్రామానికి చెందిన గోగుల స్వాతి అయిటిపాముల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తనయుడు వేముల విపుల్‌కుమార్ నకిరేకల్ ఏరియా ఆసుపత్రిలో స్వాతి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ మండల అధ్యక్షుడు గాదగోని కొండయ్య తదితరులుపాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/మిర్యాలగూడ: నియోజకవర్గంలో రాబోయే ఎల్ నినో ప్రభావం వల్ల తలెత్తే వాతావరణ మార్పులు, వ్యవసాయ రంగం, ప్రజల జీవన పరిస్థితులపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. మంగళవారం మిర్యాలగూడ మండలం, అడవిదేవుల పల్లి మండలాల్లో వేర్వేరుగా నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎల్ నినో ప్రభావం మరియు తీసుకోవాల్సిన నివారణ చర్యలు అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు సమిష్టిగా భాగస్వాములై బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించాలి



మాజీ ఎంపి బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

ప్రజాపక్షం/మిర్యాలగూడ: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించాలని, అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదని మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు హెచ్చరించారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు హాజరై మాట్లాడారు. మిర్యాలగూడ పట్టణంలో ఈ నెల 6వ తేదీన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించాలనే గొప్ప లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేసిందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన పూర్తి జాబితాను బహిరంగంగా ప్రకటించాలని, ఎంపికలో అనుసరించిన నిబంధనలు, అర్హత ప్రమాణాలను ప్రజలకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడవల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎండి. ఇలియాస్ ఖాన్, ఎండి. మగ్దుం పాషా, బంటు శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, సందేషి అంజన్ రాజు, ఎండి. మాజీద్, తిరుమలగిరి వజ్రం, దైద సత్యం, గంగుల భిక్షం యాదవ్, జన్నపాల కిరణ్, దీపిక విజయ్, అరుణ్, ఎండి. అలీం, రుక్షాన, బంటు దుర్గయ్య, పందిరి వేణు, వల్లపట్ల వినోద్, ఖలీల్, ఎక్క మనిదీప్, బిక్కన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలకు రైతులు ప్రాధాన్యతనివ్వాలి

సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు వెంకటేశం



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో ఫారం పౌండ్ ఇంకుడు గుంత నిర్మాణ పనులను సర్పంచ్‌ల మండల ఫోరం అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రైతులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారన్నారు. తమ వ్యవసాయ భూములలో నీటి నిల్వ కోసం ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాల పెంపునకు దోహదపడవచ్చని తెలిపారు. ఇంకుడు గుంతల్లో నిల్వ చేసిన నీటిని వృథా కాకుండా కూరగాయల సాగుకు, చేపల పెంపకానికి ఉపయోగించుకోవచ్చని సూచించారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులకు మహిళా సంఘాల్లో సభ్యత్వం ఉంటే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం గేదేల షెడ్డు నిర్మాణంతో పాటు రెండు గేదేలను పొందేందుకు కూడా అవకాశం ఉందని వెంకటేశం సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, వార్డు సభ్యులు యాదయ్య, చేకూరి గణేష్, ఫీల్డ్ అసిస్టెంట్ చేకూరి మల్లేష్, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు

విద్యార్థినులు భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/మిర్యాలగూడ: మహిళలు, విద్యార్థినులు తమ భద్రత పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్‌లోని గురుకుల పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పి శరత్‌చంద్ర పవర్ ఆదేశాల మేరకు, సిఐ మంజుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. చదువుతో పాటు స్వీయ రక్షణ పద్ధతులపై కూడా విద్యార్థినులు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. టిసేఫ్ యాప్ వినియోగం, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, ఈవ్ టీజింగ్, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోక్సో చట్టం, గుడ్ టచ్‌బ్యాడ్ టచ్ మధ్య తేడాలు, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి అంశాలను వివరించారు. ఆపద సమయంలో షీ టీం సహాయం ఎలా పొందవచ్చో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది కానిస్టేబుల్ రాజేశ్వరి, రవీందర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కడారి అనుకరణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.చిత్రం: శ్రీనివాస్ నగర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపల్ కడారి అనుకరణ, షీ టీం సిబ్బంది.

మహిళల రక్షణలో నల్లగొండ షీ టీమ్స్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మహిళలు, బాలికలు, చిన్నారులు, విద్యార్థినుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని అదనపు ఎస్పి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈవ్ టీజింగ్,లైంగిక వేధింపులు,అసభ్య ప్రవర్తన వంటి ఘటనలను అరికట్టేందుకు షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తూ బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు.నల్లగొండ,మిర్యాలగూడ కేంద్రాలుగా రెండు షీ టీమ్స్ బృందాలు పనిచేస్తున్నాయని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ తదితర జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేసి వేధింపులకు పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు.మహిళలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను తెలియజేసేందుకు షీ టీమ్స్ భరోసా కల్పిస్తున్నాయని ఫిర్యాదు చేయడానికి మహిళలు నేరుగా పోలీస్ స్టేషన్లకు రావాల్సిన అవసరం లేకుండా డయల్ 112,పోలీస్ శాఖ అందించిన క్యూ.ఆర్ కోడ్,వాట్సాప్ తదితర మార్గాల ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించామని తెలిపారు.



ఎఐకెఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాపక్షం/నకిరేకల్: ఈనెల 15 నుండి 18 వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న 36వ ఏఐకేఎస్ జాతీయ మహాసభలను రైతాంగమంతా తరలివచ్చి జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల పిలుపునిచ్చారు.మహాసభల ప్రచారంలో భాగంగా నకరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్ గౌడ్, మండల కమిటీ సభ్యులు బొడ్డుపల్లి లక్ష్మీనరసయ్య,యానాల వెంకటరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ(ఏఐకెఎస్) మహాసభలలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఐతరాజు నర్సింహ్మా పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలు, రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాసభల ప్రారంభం సందర్భంగా నవంబర్ 15వ తేదీన నల్లగొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, ప్రజా సంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నర్సింహ్మా విజప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల నాయకులు బెలిజ మల్లయ్య, పాకాల పెద్దులు, ఉయ్యాల మారయ్య, సంధ్య, యాదమ్మ, లక్ష్మి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నీట్ల నివారణ కార్యక్రమం

ప్రజాపక్షం/రామన్నపేట: మండల పరిధిలోని వెల్లంకి గ్రామంలో పాడిఆవు దూడలకు మరియు గేదె దూడలకు ఉచిత నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా చల్లమల్ల పెంటారెడ్డి బావిదగ్గర దూడలకు నట్టల మందులను మంగళవారం సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ వేశారు.ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ మాట్లాడుతూ ఈ సేవలను గ్రామంలోని పాడి రైతులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాషిని, గోపాల మిత్ర మల్లేష్, రైతులు చలమల్ల పెంటా రెడ్డి, గట్టు భాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాపక్షం/బొమ్మలరామారం: బొమ్మల రామారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ప్రజాపరిషత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి బి. భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలు, గ్రామాల్లో చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో డి. శ్యామల, మండలంలోని సర్పంచులు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్ కన్వీనర్‌గా జయసాగర్

ప్రజాపక్షం/నకిరేకల్: ఇటీవల కట్టంగూరు లో జరిగిన టీఎస్ యుటిఎఫ్ 7వ జిల్లా మహాసభలలో జిల్లా స్టడీ సర్కిల్ కన్వీనర్ గా పుణ్యమూర్తి జయసాగర్ నియమించబడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కుల సాధన, సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటాలకు మిటి సమావేశంలో వారు మాట్లాడారు. గత ఉద్యమాన్ని సమీక్షించుకొని, టీఎస్ యుటిఎఫ్ ఎల్ల ప్పుడూ ముందుంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

శ్రీరామ దూతకు పంచామృతాభిషేకాలు

ప్రజాపక్షం/నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో కొలువైన శ్రీరామదూత ఆంజనేయ స్వామికి మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ పూజారి కొలచిన దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో సాంప్రదాయబద్ధంగా ఆవు పాలు, ఆవు నెయ్యి, పంచదార, గంధం, తేనె, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు పూలమాలలతో పూలతో ప్రత్యేకంగా అలంకరించి తమలపాకులతో పూజలు నీరాజన మంత్రపుష్పం తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, తాటికొండ వెంకటరెడ్డి, పొనుగోటి జంగారావు, ఉప్పల కృపాకర్, చింతకుంట్ల శ్రీనివాస రావు పాల్గొన్నారు.

సాగు భూమి సంరక్షణపై అవగాహన

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: రైతు వేదికలో మంగళవారం సాగుభూమి సంరక్షణ (కేత్ బచావో అభియాన్) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి.పూజ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ రంగంపై ఎల్నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు ఆరుతడి పంటలైన పెసర, మినుము తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే భూసార పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ (పిఎస్‌బి) రైజోబియం, ట్రైకోడెర్మా వంటి జీవ ఎరువులను, పచ్చిరొట్ట ఎరువులను విస్తృతంగా వినియోగించాలని రైతులకు సూచించారు. వీటి వినియోగం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు పంటల సాగులో స్థిరమైన వ్యవసాయ పద్ధతులను పాటించాలని అవగాహన కల్పించారు. ఆత్మ కమిటీ సభ్యులకు సన్మానంచేశారు. ఆత్మ పథకానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సభ్యులుగా నారాయణపురం ప్రాంతం నుంచి ఎంపికైన



నలుగురు సభ్యులు, రాచకొండ రమేష్ నారాయణపురం, సుర్కంటి రంగారెడ్డి చిమిర్యాల, ఎర్ర వెంకటేష్ గుజ్జ, కొర్ర పరెంగ రాచకొండ, ఎన్నికయ్యారు. రైతుల సంక్షేమం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, ఈ పి ఓ చైర్మన్ జక్కిడి మధుసూదన్ రెడ్డి, పిఎస్‌సిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు, నవ్య, త్రివేణి, రాజేశ్, అనురాధ, రైతులు ఏపూరి సతీష్, ఉప్పల నాగరాజు,పెద్దగొని విష్ణు, గునిగంటి రాజు పలువురు రైతులు పాల్గొన్నారు.

పివైఎల్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : పివైఎల్ జిల్లా 9వ మహాసభను జయప్రదం చేయాలని పివైఎల్ సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నల్గొండ నాగయ్య, డి.రవి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక చండ్రాపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ప్రగతి శీల యువజన సంఘం (పివైఎల్) సూర్యాపేట జిల్లా కమిటి సమావేశంలో వారు మాట్లాడారు. గత ఉద్యమాన్ని సమీక్షించుకొని, భవిష్యత్తు కార్యాచరణ, దేశంలో, రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు ఈ మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ సమస్య, ఉద్యోగ, ఉపాధి సమస్యలు, గంజాయి, డ్రగ్స్, మద్యం, అనేక రకాల యువత ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 13న నూతనకల్ మండల కేంద్రంలో జరుగు జిల్లా మహాసభలను జరుపుకుంటున్నామన్నారు. ఈ మహాసభలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పివైఎల్ నాయకులు బండి రవి, పొన్నం బ్రహ్మం, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

ట్రాన్స్‌కో రూరల్ జోన్ సీఈ బాలస్వామి

ప్రజాపక్షం/చౌటుప్పల్: ఎల్‌నినో ప్రభావం వల్ల విద్యుత్ వాడక డిమాండ్ బాగా పెరిగిన నేపథ్యంలో పొదుపుగా వినియోగించుకోవాలని ట్రాన్స్‌కో రూరల్ జోన్ సీఈ బాలస్వామి కోరారు.చౌటుప్పల్ మునిసిపల్ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ పంటల్లో ఆరుతడి ఉన్న పంటను మాత్రమే సాగు చేసుకోవడం శ్రేయస్కరమని అన్నారు.విద్యుత్ వినియోగదారులు ఇండ్లలో అవసరం మేరకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలని సూచించారు.గ్రామాల్లోని వీధీ లైట్లను అనవసరంగా వాడవద్దని అన్నారు.వినియోగదారులకు ఎలాంటి సమస్య ఉన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాలని తెలిపారు.వినియోగదారుల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఈ సురేష్,చౌటుప్పల్ డిఈ మల్లీకార్జున్,చౌటుప్పల్,భూదాన్‌పోచంపల్లి,సంస్థాన్ నారాయణపురం మండల ఏఈలు రాజుల సతీష్,దివ్య,ఉమ,విద్యుత్ సిబ్బంది,వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాపక్షం/రామన్నపేట: విద్యుత్ వినియోగదారులకు సమస్యలు లేకుండా మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏడీఈ. కె.శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వ్యవసాయ బావులవద్ద విద్యుత్ వినియోగ సామర్థ్యం పెంపుకోసం ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన పంపు సెట్లు, కెపాసిటర్లను వాడాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు యం. కోటేశ్వర్‌రావు, జె.నరసింహా, ఏవీవో డి.మోతీరాం, సిబ్బంది యం.నటరాజ్, కే.శ్రీనివాస్ రెడ్డి, కే.శ్రీనివాస్, కె.స్వాతి, ఎండి అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్‌లో చేరిక

ప్రజాపక్షం/భువనగిరిరూరల్: భువనగిరి మండలంలోని రెడ్డి నాయక్ తండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ మండల నాయకులు భూక్యా భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి మాజీ ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి సమక్షంలో 50 మంది కార్యకర్తలు వారికి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ భూక్య రఘునాయక్, ఒకటో వార్డ్ నెంబర్ భూక్య బుజ్జి, వివిధ పార్టీలకు చెందిన కునూసోతు శివలాల్, కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ భూక్య రఘునాయక్, నాయకులు ధారావత్ బిచ్చు నాయక్, భూక్య గణేష్, శ్రీకాంత్ రాజు వాసు, భూక్య సిద్దు భూక్య లింగ్య తో పాటు పలువురు చేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జనగాం



పాండు, పిఎస్ఎస్ మాజీ చైర్మన్ బలుగూరి మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కా రాఘవేందర్ రెడ్డి, జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, మాజీ సర్పంచ్ గోదా శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పిటిసి సందెల సుధాకర్,అంకర్ల మురళి మాజీ సర్పంచ్ గోపి నాయక్ తండ గ్రామ శాఖ అధ్యక్షులు ఇస్లావత్ నరేష్, వార్డు సభ్యులు దారావత్ రవి, భూక్య వెంకటేష్, దారావత్ రాములు, దారావత్ రాంజీ, శ్రవణ్ చిన్న పాల్గొన్నారు.

ఉప్పల ఉప్పయ్య జీవితం ఆదర్శప్రాయం

ప్రజాపక్షం/మోతె : సమసమాజ నిర్మాణం కోసం ఉప్పల ఉప్పయ్య ఎంతో కృషి చేశారని ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి అన్నారు. మండలంలోని సిరికొండ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన డివైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు ఉప్పల ఉప్పయ్య సంతాపసభలో ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఉప్పయ్య అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ జీవితాంతం కమ్యూనిస్టుగా జీవించారని కొనియాడారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరికి విద్య అందాలని, ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన నిరంతరం తపించేవారన్నారు. సిపిఎం గ్రామ కార్యదర్శి కాంపాటి శ్రీను అధ్యక్షతన జరిగిన సంతాప సభలో నాయకులు కొలిశెట్టి యాదగిరి రావు, మట్టిపల్లి సైదులు, బచ్చలకూర స్వరాజ్యం, కిన్నెర పోతయ్య, దోసపాటి శ్రీను పాల్గొన్నారు.

అంగన్ వాడీ, ఆయా పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా ఐసీడీఎస్ రామన్నపేట ప్రాజెక్టు పరిధిలోగల సంస్థాన్ నారాయణపురం మండలంలో గత నాలుగు నెలల క్రితం ఖాళీగా ఉన్న 3అంగన్‌వాడి టీచర్, 3ఆయా పోస్టులకు నోటిఫికేషన్ జారిచేశారు. కానీ నేటికీ పోస్టులను భర్తీ చేయలేదు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ తోనే సరిపెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో సిబ్బంది కొరత కారణంగా చిన్నారులు, గర్భిణీలకు, బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారం ఇతర సేవలకు ఆటంకం కలుగుతుందని ప్రజల డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత ఐసిడిఎస్, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఖాలీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు.

అంకిరెడ్డిగూడెంలో ఉచిత వైద్యశిబిరం



ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అదేవిధంగా రూ.80,362 విలువైన నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నుర్వి మల్లేష్ మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయంత్‌కుమార్, పాఠశాల చైర్మన్ లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి పాండు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు వెంకటేశం, శేట్టయ్య, మల్లేషం, దివిస్ ప్రతినిధులు గోపి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/త్రిపురారం: ప్రభుత్వ మోడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సభ్యులు అన్నారు.ప్రభుత్వ మోడల్ స్కూల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సభ్యులు మంగళవారం ఎంపీడీఓ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ జాక్ స్టీరింగ్ కమిటీ సభ్యులు మల్లికంటి వెంకటేశ్వర్లు,బోయినపల్లి రజినీకాంత్,అన్నమరెడ్డి శ్రీనివాసరావు, గుంటోజు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఘన సన్మానం

ప్రజాపక్షం/బీబీనగర్: తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దాసరి అనసూయ/సీతక్కను బీబీనగర్ మండలంలోని ఎయిమ్స్ ఆసుపత్రిని మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పొట్లోల్ల శ్యా మ్ గౌడ్, గ్రామ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ నాయకులు, డైరెక్టర్స్, తదితరులు కలిసి మంత్రి సీతక్కకు శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు

ప్రజాపక్షం/చండూరు: ఎల్ నినో ప్రభావం వల్ల భూగర్భ జలమట్టాలు తగ్గుతూ ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎల్నినో ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీలోని 6 వార్డులో ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద తప్పని సరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చూసుకోవాలని తెలిపారు. భవనాల కప్పుపై వర్షపు నీటిని సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాలను పెంపొందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగిడి పర్వతరెడ్డి 19వ వర్ధంతి



ప్రజాపక్షం/డిండి: దివంగత నేత స్వర్గీయ గంగిడి పర్వతరెడ్డి 19వ వర్ధంతి సందర్భంగా మంగళవారం బొల్లనపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బొల్లనపల్లి స్టేజ్ వద్ద పర్వతరెడ్డి విగ్రహానికి గ్రామ సర్పంచ్ గంగిడి స్వప్న మల్లారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పర్వతరెడ్డి కుటుంబ సభ్యులు, కుమారులు గంగిడి మల్లారెడ్డి, గంగిడి ఆనంద్‌రెడ్డి, గ్రామ ప్రజలు, గ్రామ ప్రజాప్రతినిధులతో పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి ఆశయాలను, సేవలను కొనియాడారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రజాపక్షం/-తుర్కపల్లి: మండలంలో రాంపూర్ మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు చిలువేరు మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మోడల్ స్కూల్ జెయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు తుర్కపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కల్పనకు వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడుతూ 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, చనిపోయిన కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు, టిజిటిలకు లోకల్ సర్వీసులు ఇవ్వాలని, మోడల్ స్కూల్ టీచర్లకు జీవో నెంబర్ 317 అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం బేసిక్ పే ఇవ్వాలని, పెండింగ్ డిఎ, ఏరియాస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, నవనీత, మధు, అరవింద్, భవాని, సంగీత, రమణ, సరిత, రమేష్ రెడ్డి, మల్లేష్, స్వర్ణలత లు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సిసి కెమెరాలు ఎంతో ఉపయోగకరం

బొల్లనపల్లి గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటు



ప్రజాపక్షం/డిండి: బొల్లనపల్లి గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామ సర్పంచ్ గంగిడి స్వప్న మల్లారెడ్డి ఆధ్వర్యంలో సిసి కెమెరాల ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిండి ఎస్ఐ సిహెచ్. బాలకృష్ణ హాజరై స్థానిక సర్పంచ్‌తో కలిసి సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గంగిడి స్వప్నమల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, అసాంఘీక కార్యకలాపాల నియంత్రణలో సిసి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల రక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. సిసి కెమెరాల ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవ్య, ఉప సర్పంచ్ పేట కొండల్, పాలక వర్గ సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ గంగిడి ఆనంద్‌రెడ్డి, గ్రామ నాయకులు అలీ, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్—వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు నిర్మించాలి



మాజీ ఎమ్మెల్యే కంచర్ల

ప్రజాపక్షం/నలగొండ టౌన్ : పట్టణంలోని 9వ డివిజన్ పరిధిలో సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగర్ రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి వెంకటరమణ కాలనీ వరకు లింక్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీ, వసుంధర కాలనీ, పటేల్ నగర్, సూర్యవంశం కాలనీ, చైతన్యపురి కాలనీలకు అనుసంధాన రహదారి లేకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం 100 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడితే ఈ కాలనీల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి,టౌన్ ప్రెసిడెంట్ భువనగిరి దేవేందర్, 9వ డివిజన్ కార్పొరేటర్ దీప్లా నాయక్,కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, గోపగోని స్వాతి, రాజశేఖర్ గౌడ్, వజ్జ శ్రీనివాస్ యాదవ్, దండంపల్లి సత్తయ్య, రావుల శ్రీనివాస్ రెడ్డి,దేపా రాంరెడ్డి, గోపగోని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎవి రెడ్డి ఆర్థిక సాయం

ప్రజాపక్షం/నాంపల్లి: మండలంలోని చిట్టంపహాడ్ గ్రామానికి చెందిన బల్సుల భాగ్యమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఏవీ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.భాగ్యమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా మృతురాలి కుమారుడు నాగశ్రవణ్ కు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నాయిని జగన్ మోహన్ రెడ్డి,అబ్బనబోయిన చంద్ యాదవ్,నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్,యువ నాయకుడు గజ్జెల శివారెడ్డి,మహమ్మదాపురం మాజీ


పాడి పశువుల సంరక్షణ రైతుల ఆర్థికాభివృద్ధికి కీలకం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పాడి పశువుల సంరక్షణ రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు.పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆంజనేయ స్వామి దేవాలయంలో దూడల నట్టల నివారణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యి దూడలకు స్వయంగా మందు వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో దూడలకు నట్టల నివారణ మందులు వేయిస్తే వ్యాధులు దరి చేరవని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండల పశువైద్యాధికారి పృథ్వీరాజ్ ప్రజాప్రతినిధులు శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా తడక మోహన్

జిల్లా కమిటీ సభ్యులుగా ఎండి.ఖయ్యూం,జెల్లా రమేష్ లు ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాపక్షం/చౌటుప్పల్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడిగా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి చెందిన అడ్వకేట్ తడక మోహన్, జిల్లా కమిటీ సభ్యులుగా చౌటుప్పల్ పట్టణానికి చెందిన ఎండి.ఖయ్యూం,జెల్లా రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నియ్యారు.ఆదివారం నిర్వహించిన ఐలు జిల్లా రెండో మహాసభ జరిగింది.ఈ మహాసభల్లో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను, కోర్టుల్లో మౌళిక సదుపాయాల ఏర్పాటు కోసం భవిష్యత్ ఉద్యమాలు చేస్తామని అన్నారు. చౌటుప్పల్‌లో కోర్టు నూతన భవన నిర్మాణ ఏర్పాటు కోసం కృషి చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

ప్రజాపక్షం/డిండి: టిఎస్‌యుటిఎఫ్ నల్గొండ జిల్లా 7వ మహాసభలు సోమవారం కట్టంగూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలో నూతన జిల్లా కమిటి ఎన్నికల్లో భాగంగా జిల్లా కార్యదర్శిగా గండమల్ల రామారావు, ఎఫ్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నేనావత్ పూర్వ, జిల్లా కమిటి సభ్యురాలిగా ముంజంపల్లి సుజాతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘం తరుపున నిరంతరం పోరాడుతామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులందరిని ఐక్యంగా ముందుకు నడిపిస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు పలువురు ఉపాధ్యాయులు, సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.



సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/చౌటుప్పల్: ఎమ్మెల్సీ ఓటరు నమోదులో గత రెండురోజులుగా ఆన్‌లైన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యను తక్షణమే పరిష్కరించాలని జనసేన ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులు ఆముదాల పరమేష్ కోరారు. ఈ మేరకు యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెబ్‌సైట్ పని చేయకపోవడం వల్ల ఓటు నమోదు కోసం తీవ్ర ఇబ్బంది జరుగుతుందని అన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయడానికి జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి ఓటరు నమోదు వేగవంతం చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత పట్టభద్రులకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. ఓటరు నమోదుకు నవంబర్ 6తో ముగుస్తుండగా నమోదు కోసం అదనపు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో జనసేన నాయకులు రమేష్, ప్రవీణ్, సంతోష్, ప్రశాంత్, నరేష్, రాజు తదితరులు ఉన్నారు.

మర మగ్గాల కార్మికుల కూలీ రేట్లు పెంచాలి

ప్రజాపక్షం/గుండాల: మర మగ్గాల కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని గుండాల మండలం సుద్దాల గ్రామ సిపిఐ సినియర్ నాయకులు ఏలే కృష్ణహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా మర మగ్గాల కూలీ రేట్లు పెరగలేదని దింతో కూలీలు తీవ్ర ఆర్థిక సమస్యలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మగ్గం కార్మికులు ఒక పూట తింటూ మరో పూట పస్తులు ఉండే పరిస్థితి నేడు నెలకొందని ఇప్పటికైన ప్రభుత్వం మర మగ్గాల కార్మికులను పట్టించుకొని వారి సమస్యలను పరిష్కరించి కూలీ రేట్లను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శ

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: ఇటీవల పార్టీ నాయకుల గొడవల్లో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న మార్కెండేయ నగర్ వాసి జోగు శ్రీనివాస్‌ను మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మంగళవారం కలిసి పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరిగైన ఆధునిక చికిత్స అందించాలని డాక్టర్లను ఆయన కోరారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.



భూ సర్వే పనులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

భూముల హద్దులను కచ్చితంగా గుర్తించాలి: అధికారులకు సూచన

ప్రజాపక్షం/మర్రిగూడ: మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ సర్వే పనులను ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్‌తో కలిసి క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ భూ సర్వే పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని గ్రామకంఠం, ఇనాం భూములు, ప్రభుత్వ భూములతో పాటు రైతుల వ్యక్తిగత భూముల హద్దులను కచ్చితంగా కొలవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పాండురంగారెడ్డి,జీపీడీవో గిరి,ట్రైనీ సర్వేయర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కాచంను పరామర్శించిన గర్దాసు విక్రమ్

ప్రజాపక్షం/రామన్నపేట: తెలంగాణ ఉద్యమకారుడు విశ్వంభర పత్రిక అధినేత కాచం సత్యనారాయణ తండ్రి కాచం భిక్షమయ్య ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గర్దాస్ విక్రమ్ మంగళవారం కాచం సత్యనారాయణను పరామర్శించి కాచం భిక్షమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు.ఈ కార్యక్రమంలో అరూరు గ్రామ సర్పంచ్ సుక్క ముత్యాలు నాయకులు పాల్గొన్నారు.

అధిక ధరలకు సన్నబియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు



ప్రజాపక్షం/మిర్యాలగూడ: సన్న బియ్యం నిర్ణీత ధరల కంటే అధిక ధరకు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేష్ హెచ్చరించారు. మంగళవారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జిల్లా సరఫరాల శాఖ మేనేజర్ రాంపతి, స్టేట్ టాస్క్ ఫోర్స్ అధికారి లక్ష్మారెడ్డి, జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముందు నియోజకవర్గ పరిధిలోని పలు రైస్ మిల్లులను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం సన్న బియ్యం విక్రయాలకు నిర్దిష్ట ధరలను నిర్ణయించిందని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే వ్యాపారులు విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్లు బిపిటి రూ.62, ఆర్ఎన్ఆర్ రూ.70, జైశ్రీరామ్ రకం బియ్యాన్ని రూ.75 చొప్పున రిటైలర్లకు విక్రయించాలని సూచించారు. రిటైలర్లు బిపిటి రూ.64, ఆర్ఎన్ఆర్ రూ.72, జైశ్రీరామ్ రూ.77 చొప్పున మిల్లర్ల నుంచి కొనుగోలు చేస్తారని వెల్లడించారు. వినియోగదారులకు బహిరంగ మార్కెట్లో బిపిటి రూ.66, ఆర్ఎన్ఆర్ రూ.74, జైశ్రీరామ్ రూ.79 చొప్పున విక్రయించాలని తెలిపారు. మార్కెట్లో సన్న బియ్యం కొరత ఎక్కడా లేదని, కృత్రిమ కొరతను సృష్టించి ఎక్కువ ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ధాన్యం తూకాలలో తేడాలు ఉన్నా, అధిక ధరలకు విక్రయించినా టోల్ ఫ్రీ నంబర్ 9281423653కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.ప్రతి రైస్ మిల్లు, రిటైల్ దుకాణం వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ఫ్లెక్సీల ద్వారా స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యాన్ని అందించేందుకు సహకరిస్తామని రైస్ మిల్లర్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, మిర్యాలగూడ మిల్లర్స్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, వెంకటరమణ చౌదరి, గోల్ల రామశేఖర్, గంతే రాము, బండారు కుశలయ్య, గుడిపాటి శ్రీనివాస్, రేపాల అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో 100 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/త్రిపురారం: ఎల్నినో ప్రభావములో భూగర్భ జలాలు పూర్తిస్థాయిలో పడిపోయాయని,భూగర్భ జలాల పెంపుకు ప్రతి గ్రామపంచాయతీ లో ఇంకుడు గుంతలు నిర్మించాలని ఎంపీడీవో విజయ కుమారి అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయ కుమారి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఎంపీడీవో విజయ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేయాలన్నారు. జలషాలలో సాగునీరు లేనందున వేసవిలో రైతులు వరి పంట సాగు చేయకుండా ప్రత్యామయ పంటలు సాగు చేసుకునే విధంగా అందరూ అధికారులు రైతులను అప్రమత్తం చేయాలన్నారు.విద్యుత్ కొరత తీవ్రంగా ఉందని సోలార్ పవర్ ను ఏర్పాటు చేసుకోవాలన్నారు.సోలార్ పవర్ ఏర్పాటు ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లీల,తాహసిల్దార్ గాజుల ప్రమీల,ఎంఈఓ రవి,విద్యుత్ ఏ ఈ బాలు నాయక్,వ్యవసాయ అధికారి పార్వతి చౌహన్,వైద్యాధికారి వనిత,వెటర్నరీ డాక్టర్ నాగేందర్, ఏపీవో శ్యామల,ఎంపీఓ శివ,మాజీ పిఏసిఎస్ చైర్మన్ జయరాం నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు,కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిషేధ చట్టాల అమలుకు సహకరించాలి

శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/మిర్యాలగూడ: బాల్యవివాహాల నిషేధ చట్టం, దత్తత చట్టం, పోక్సో చట్టం సమర్థవంతమైన అమలుకు సమాజంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు, చట్టాలపై ప్రజల్లో విస్తృతమైన చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టాలపై అవగాహన కల్పించేలా ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ పోస్టర్లను ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. బాలికల రక్షణ, వారి భవిష్యత్తు పరిరక్షణకు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎం.వేణుగోపాలరావు, ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ, ప్రత్యేక అధికారి డాక్టర్ జూలకంటి వెంకట్ రెడ్డి, సూపర్‌వైజర్లు కె.నాగమణి, నజీమాబేగం మొహమ్మద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం

గోదాం షట్టర్ నుంచి వర్షపు నీరు లీకేజీ..ఆందోళనలో డీలర్



ప్రజాపక్షం/త్రిపురారం: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రేషన్ బియ్యం తడిసిపోయాయి. గ్రామస్తులకు పంపిణీ చేయాల్సిన సుమారు 20 క్వింటాళ్ల సన్న బియ్యం వర్షపు నీటికి తడవడంతో డీలర్ ఆందోళనకు గురయ్యారు.ఈ ఘటన త్రిపురారం మండలం బొరాయిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది.మంగళవారం రేషన్ డీలర్ రమావత్ రాము తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసేందుకు సన్న బియ్యాన్ని గోదాంలో భద్రపరిచారు. అయితే రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి గోదాం షట్టర్ నుంచి నీరు లోపలికి లీకేజీ కావడంతో సుమారు 20 క్వింటాళ్ల బియ్యం తడిసిపోయాయని తెలిపారు.ఎంతో జాగ్రత్తగా నిల్వ ఉంచిన బియ్యం వర్షపు నీటికి తడవడంతో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు గోదాంను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని,నష్టపోయిన డీలర్‌ను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని రమావత్ రాము కోరారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయం

డిఎస్పి శివరాం రెడ్డి

ప్రజాపక్షం/నలగొండ టౌన్ : నిరుద్యోగులకు స్వచ్ఛంద సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పించడం మంచి పరిణామం నల్లగొండ డిఎస్పి కొలను శివ రాం రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోగల డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ సెంటర్ సెమినార్ హాల్లో ఎస్కెఎస్ ఎస్ జాబ్ మేళా కార్యక్రమ అధ్యక్షుడు పొట్టిపాక నాగరాజు అధ్యక్ష తన ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు నల్లగొండ డిఎస్పి ముఖ్య అతిథిగా పాల్గొని జాబ్ మేళాలను ప్రారంభించి మాట్లాడుతూ నిరుద్యోగులు అధైర్య పడకుండా, చెడు వ్యసనాలకు బానిస కాకుండా,ఈజీ మనీ కి అలవాటు పడకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగం చేస్తూ కష్టపడి తమ కలలను సహకారం చేసుకుంటూ,లక్ష్యాలను విజయవంతంగా నెరవేర్చుకోవాలని అన్నారు.ప్రస్తుత సమయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వందల మంది నిరుద్యోగ యువవిధ కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం గొప్ప విషయమన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫసర్ డా. ఎస్. ఉపేందర్,టూ టౌన్ ఎస్ఐ సైదా బాబు ,అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్ ,ఫోక్సకన్ హెచ్ ఆర్ మేనేజర్ శ్రీనివాస్,ఎస్కేఎస్ఎస్ మేనేజర్ మూర్తి,సంస్థ ప్రతినిధులు,తరాల నరేష్,తోగిటి అనుదీప్,సన్నల మధు,కట్ట హరి బాబు,నాంపల్లి మధు,తోనుకునూరి సన్నీ,కొమూరు అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ నుంచి మునుగోడు వైపు బిసి రాజ్యాధికార యాత్ర

సంప్రదాయ వృత్తిదారులు,చిరు వ్యాపారులు, రైతులు,యువకులతో ముచ్చట



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: బిసి రాజ్యాధికార యాత్ర 41వ రోజులో భాగంగా తీన్మార్ మల్లన్న నల్లగొండ నుంచి మునుగోడు వైపు పాదయాత్ర కొనసాగిస్తున్నారు. మార్గమధ్యంలో వివిధ వర్గాల ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. నల్లగొండ టౌన్ లైబ్రరీ వద్ద కేతేపల్లికి చెందిన విద్యార్థి సాయి మల్లన్నను కలిశారు. మేదరి సామాజికవర్గానికి చెందిన విజయ్ కుమార్ తమ సంప్రదాయ చాటలు అల్లే వృత్తి గురించి వివరించారు. పాతబస్తీలో ఇస్త్రీ దుకాణం నిర్వహిస్తున్న లక్ష్మణ్, శంకర్, భీమనపల్లి తమ సమస్యలను మల్లన్న దృష్టికి తీసుకువచ్చారు.నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామంలో బిసి మహిళా సంధ్య నేతృత్వంలో గ్రామస్తులు హారతులతో మల్లన్నకు ఘనస్వాగతం పలికారు. గణేష్ నేతృత్వంలో యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం గ్రామంలోని బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో మల్లన్న కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక రైతు రాములు మల్లన్నను కలిసి వ్యవసాయ సంబంధిత అంశాలపై చర్చించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార యాత్ర మునుగోడు వైపు కొనసాగుతోంది.



2028లో మునుగోడులో బిసి ఎమ్మెల్యే పక్కా

మీ ఓట్లు వద్దు,మీ సోపతే వద్దు : కోమటిరెడ్డి బ్రదర్స్‌పై తీన్మార్ మల్లన్నఫైర్



ప్రజాపక్షం/మునుగోడు : మునుగోడులో బిసి రాజ్యాధికార యాత్ర 41వ రోజు కొనసాగింది. మంగళవారం పాదయాత్రగా మునుగోడుకు చేరుకున్న టీఆర్పి అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మునుగోడు సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యంత పేద నియోజకవర్గమని,కానీ ఇక్కడి నుంచి గెలిచే ఎమ్మెల్యేలు మాత్రం కోట్లకు పడగలెత్తారని విమర్శించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మనసు చంపుకుని దళితుడైన ఉప ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లానని అంటున్నాడు,మరి గొల్ల,కురుమల దగ్గరకు వచ్చినప్పుడు మీ మనసు చావలేదా అని ప్రశ్నించారు. వరంగల్‌ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రస్తావిస్తూ, కోమటిరెడ్డి బ్రదర్స్‌కు అసలు గ్రాడ్యుయేట్ ఓటే లేదని ఎద్దేవా చేశారు.మీ ఓట్లు మాకు వద్దు,మీ సోపతే వద్దు.మా బొందలు వేరు,మీ బొందలు వేరు అని వ్యాఖ్యానించారు. టీఆర్పి తరపున బిసి బిడ్డ పాలకూరి అశోక్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టామని,తన సొంత స్థానాన్ని త్యాగం చేశానని తెలిపారు.15 లక్షల గ్రాడ్యుయేట్ ఓట్లలో 8 లక్షలు బీసీలవేనని అన్నారు. రాష్ట్రంలో లక్ష మంది కూడా లేని వెలమలకు 13 మంది ఎమ్మెల్యేలు,10 లక్షల లోపు ఉన్న రెడ్లకు 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, 2 కోట్లకు పైగా ఉన్న బిసిలు మాత్రం ఎంపిటిసి టికెట్ కోసం తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు వైద్యం వెంకటేశ్వర్లు,మునుగోడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సతీష్ బాబు, పార్టీ జాతీయ వ్యవహారాల ఇన్చార్జ్ పూజిత, కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు అరుణ,పార్టీ నాయకులు కంటాల యాదగిరి, శేఖర్, రాణి, గొల్లకుర్మ సంఘం నాయకులు, పార్టీ కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.